క్లుప్తంగా

గో సంరక్షణ ట్రస్ట్‌కు విరాళం



విరాళమిస్తున్న మంజువాణి కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయ గో సంరక్షణ ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళాన్ని మంగళవారం మధ్యాహ్నం వైఎస్సార్ కడప జిల్లా పోరుమామిళ్లకు చెందిన మంజువాణి ఆలయ అధికారులకు అందజేశారు. వారికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ రంగస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలకు డస్ట్‌బిన్లు వితరణ



కార్యక్రమంలో ఐఓసీ అధికారులు, టీచర్లు

యాదమరి: స్థానిక ఉన్నత పాఠశాలకు యాదమరిలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ అధికారులు డస్ట్‌బిన్లు అందజేశారు. మంగళవారం ఉదయం స్వచ్ఛభారత్‌పై విద్యార్థులకు ఐఓసీ అధికారులు సమావేశం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం డస్ట్‌బిన్లు వితరణ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వెంకటరమణ, ఐఓసీ అధికారులు పాల్గొన్నారు.

గుండ్లపల్లెలో 'ఫ్యామిలీ డాక్టర్'



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

ఐరాల: మండలంలోని గుండ్లపల్లెలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు.పీహెచ్‌సీ వైద్యాధికారి పూర్ణలత 80 మంది రోగులు, గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, చిన్న పిల్లలకు వైద్య పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. అనంతరం మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ జీవకళ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు

యాదమరిలో..

యాదమరి: మండలంలోని దాసరాపల్లె సచివాలయ పరిధిలోని గ్రామాలలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహించారు. యాదమరి వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్ రోగులను పరీక్షించారు. మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

శిలాఫలకం వద్ద సెల్ఫీలు



చిత్తూరు కార్పొరేషన్ : చిత్తూరు విజయా డెయిరీ ఆవరణలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆవిష్కరించిన శిలాఫలకం వద్ద ప్రజలు సెల్ఫీలు, ఫొటోలు తీసుకునేందుకు ఎగబడ్డారు. కార్యక్రమం ముగిసిన అనంతరం ముఖ్యమంత్రి వెళ్లగానే ప్రజలు డెయిరీని, ఫొటో ఎగ్జిబిషన్ తిలకించేందుకు భారీ సంఖ్యలో విచ్చేశారు. అక్కడ శిలాఫలకం వద్ద ఉత్సాహంగా ఫొటోలు తీసుకోవడం కనిపించింది.

మల్లప్పకొండ బండలపై అన్నదానం



గుడుపల్లె: మండలంలోని బెగ్గిలిపల్లె గ్రామ సమీపంలోని మల్లప్పకొండపై వెలసిన శ్రీమల్లేశ్వరస్వామి ఆలయం వద్ద మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బెగ్గిలిపల్లె, బండకొత్తూరు, గోకర్లపల్లె గ్రామాల భక్తులు మల్లేశ్వరస్వామికి ఆలయానికి విచ్చేసి ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను పల్లకిలో కొలువుదీర్చి ప్రాకారోత్సవం నిర్వహించారు. బండలపై అన్నం, చక్కెర పొంగళ్లను వండి స్వామివారికి నివేదించారు. వాటిని ప్రసాదంగా భక్తులు ఆకులు లేకుండా బండలపైనే ఉంచుకుని భుజించారు. సంప్రదాయాలకు అనుగుణంగా బండపై తినడం ఇక్కడ ఆనవాయితీ.

ఇసుక ట్రాక్టర్ సీజ్

పలమనేరు: మండలంలోని కూర్మాయి నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి, నిందితుడు బాలాజీపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుబ్బారెడ్డి మంగళవారం తెలిపారు. వాహనాల తనిఖీల్లో భాగంగా స్థానిక గుడియాత్తం రోడ్డులో ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తుండడంతో ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్టు పేర్కొన్నారు.

సీఎం అభివాదం... పూలు చల్లుతూ మహిళల ఆనందోత్సాహం



ఆత్మీయ స్వాగతం

చిత్తూరు విజయా డెయిరీ పునరుద్ధరణకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పార్టీ నాయకులు, మహిళలు, అధికారుల నుంచి ఆత్మీయ స్వాగతం లభించింది. రోడ్ షో పొడవునా మహిళలు, ప్రజలు సీఎం సార్..సీఎం సార్ అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ, పూలవర్షం కురిపించారు. విద్యార్థులైతే జగన్ మామయ్యా..అంటూ కేరింతలు కొట్టారు. వారందరికీ సీఎం చిరునవ్వుతో అభివాదం చేశారు.

-చిత్తూరు అర్బన్/చిత్తూరురూరల్



సీఎం భారీ కటౌట్ ముందు ప్లకార్డులతో మహిళలు



సీఎం జగన్‌కు శ్రీవారి దారు ప్రతిమను అందజేస్తున్న జిల్లా కలెక్టర్ షణ్మోహన్



సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న కమిషనర్ అరుణ





సీఎంకు స్వాగతం పలుకుతున్న బుల్లెట్ సురేష్, చిత్తూరు మేయర్ అముద



ముఖ్యమంత్రికి కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయకస్వామి చిత్రపటం ఇస్తున్న పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, ఆలయ చైర్మన్, ఈఓ

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు



చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం మెసానికల్ మైదానం నుంచి దారి పొడవునా అక్కడక్కడా విజయా డెయిరీ ఏర్పాటు చేసిన సంప్రదాయ నృత్య ప్రదర్శనలు అలరించాయి. ఆదివాసీల నృత్య ప్రదర్శనలు, చెక్క భజన, జానపద నృత్యాలు, 'నవరత్నాల' నృత్యంతో విద్యార్థులు సీఎంకు స్వాగతం పలికారు. రోడ్ షోకు వచ్చిన ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఆత్మీయ పలకరింపు

చిత్తూరు అగ్రికల్చర్/చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు విజయా డెయిరీ భూమి పూజకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చిత్తూరు మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి కలిశారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు వస్తున్న సమయంలో సీఎంను కలిశారు.

సీఎంకు రాఖీ కట్టిన శైలజా చరణ్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్: మహిళా–శిశు సంక్షేమ శాఖ రాయలసీమ రీజినల్ చైర్ పర్సన్ శైలజా చరణ్‌రెడ్డి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాఖీ కట్టారు. చిత్తూరులోని పోలీస్ పరేడ్ మైదానంలో జరిగిన బహిరంగసభ వేదికపై ఆమె సీఎం చేతికి రాఖీ కట్టారు.



సీఎంను కలిసిన చిత్తూరు మార్కెట్ కమిటీ చైర్మన్

గుడిపాల: చిత్తూరు రూరల్, గుడిపాల మండలాల్లోని సర్పంచులు, ఎంపీటీసీలు, నగర కార్పొరేటర్లు, మండల ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం చీలాపల్లె సీఎంసీ ఆస్పత్రిలో మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని సీఎం ఆప్యాయంగా పలకరించారు.

గెలిపించుకుంటాం జగనన్నా!



గుడిపాల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం చీలాపల్లె సీఎంసీ ఆసుపత్రికి వచ్చినపుడు సీఎం సార్..సీఎం సార్! అంటూ మహిళలు ఎగబడ్డారు. ఆసుపత్రి ఆవరణలో మహిళలు తండోపతండాలుగా రావడంతో కొంతసేపు సీఎం వారికి నవ్వుతూ అభివాదం చేశారు. చేతులు జోడించి నమస్కరించడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. రాబోయే ఎన్నికల్లో జగనన్నా నిన్ను గెలిపించుకుంటామంటూ మహిళలు నినాదాలు చేశారు.

ఇక, ముఖ్యమంత్రి మధ్యాహ్నం 2:30 గంటలకు వెళ్లాల్సి ఉండగా జనసందోహం వలన ఆలస్యమైంది. 3:30 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరాల్సి వచ్చింది.

అల్లూరికి ఘన నివాళి



అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శ్రీనివాసులు, ప్రభాకర్‌రెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు 125వ జయంతి పురస్కరించుకుని మంగళవారం స్థానిక జెడ్పీ కార్యాలయంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, సీఈఓ ప్రభాకర్‌రెడ్డి ఘన నివాళులు అర్పించారు. ఆయన త్యాగాలను స్మరించారు. గిరిజనుల గుండెల్లోనే కాకుండా యావత్తు ప్రజల గుండెల్లో అల్లూరి సజీవంగా ఉంటారన్నారు. ఆయన పోరాటం యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో ఉచిత సేవలు



పూతలపట్టు : రైతుకు సర్టిఫికెట్ ఇస్తున్న అధికారులు, నాయకులు



యాదమరి మండలంలో..



బంగారుపాళెం : బోడబండ్ల గ్రామ సచివాలయంలో.

పూతలపట్టు: జగన్నన సురక్షతో ప్రజలకు ఉచిత సేవలు అందుతున్నాయని ఎంపీడీఓ గౌరి అన్నారు. మంగళవారం మండలంలోని బైటపల్లె, పోలవరం పంచాయతీలలో జగన్నన సురక్ష కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. సర్పంచ్ రామతులసి మాట్లాడారు. బైటపల్లె పంచాయతీలో 225 అర్జీలు అందాయి. వీటికి సంబంధించి మొత్తం 201 వివిధ రకాల సర్టిఫికెట్లను అధికారులు ప్రజలకు అందజేశారు. అలాగే పోలవరం పంచాయతీలో 259 అర్జీలు అందగా, 220 సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షులు దొరస్వామిరెడ్డి, నాయకులు నిరంజన్‌రెడ్డి, బాలాజి, వేనూతనపల్లె సర్పంచ్ ప్రవీణ్, ఇన్‌చార్జ్ ఈఓపీఆర్‌డి మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

యాదమరిలో..

యాదమరి: మండలంలోని జంగాలపల్లె సచివాలయ పరిధిలో 75 మంది లబ్ధిదారులకు జగనన్న సురక్ష పథకంలో సర్టిఫికెట్లు పంపిణీ చేసినట్లు తహసీల్దార్ హనుమంతు, ఎంపీడీఓ శివరాజ్ తెలిపారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలో 75 మందికి 11 రకాల సర్టిఫికెట్లు ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు

బంగారుపాళెం: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ జంగం మొగిలీశ్వర్ అన్నారు. మండలంలోని బోడబండ్ల గ్రామ సచివాలయ ఆవరణలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సర్పంచ్ నిర్మల అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, అర్హులకు వందశాతం సంక్షేమ ఫలాలు, అవసరమైన సర్టిఫికెట్లు అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం లక్ష్యమని అన్నారు. అర్హతే ప్రామాణికంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను ఇస్తోందన్నారు. సర్పంచ్ నిర్మల మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ పాలనలో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసినా పనులు చేసేవారు కాదని, ప్రస్తుతం జగనన్న ప్రభుత్వంలో ఇంటివద్దకే వచ్చి ప్రజలకు అవసరమైన సేవలు అందించడమే కాకుండా సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్నారన్నారు. ప్రజలకు అవసరమైన ధృవ పత్రాలను జగనన్న సురక్ష శిబిరంతో ఉచితంగా ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ హరి, డీటీ ఇబ్రహీం, ఆర్ఐ దీపక్, గ్రామ కార్యదర్శి రఘు, గ్రామ సచివాలయ సిబ్బంది, పంచాయతీ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

అమూల్ ఫొటో ఎగ్జిబిషన్



ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ముఖ్యమంత్రి

చిత్తూరు అగ్రికల్చర్: చిత్తూరు విజయా డెయిరీ పునరుద్ధరణకు శ్రీకారం చుట్టేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం చిత్తూరుకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనకు డెయిరీ ఆవరణలో కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవాలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆయన అమూల్ సంస్థ ఏర్పాటు చేయనున్న నూతన యూనిట్‌కు భూమి పూజచేసి, శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అక్కడే ఏర్పాటుచేసిన అమూల్ పాల ఉత్పత్తులపై ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలించారు. అలాగే అమూల్ సంస్థ నిర్మించనున్న డెయిరీ నమూనా, ప్రస్తుతం డెయిరీలో పాడైన యంత్రాల ఫొటోలు, జగనన్న పాలవెల్లువ సేకరణ ఫొటోలను ఎగ్జిబిషన్‌లో ముఖ్యమంత్రి తిలకించారు. అక్కడికి విచ్చేసిన మహిళా రైతులను ముఖ్యమంత్రి ఆప్యాయంగా పలకరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్‌కె రోజా, ఎంపీలు మిథున్‌రెడ్డి, రెడ్డెప్ప, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, ద్వారకనాథరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు, ఎంఎల్‌సీ భరత్, జిల్లా కలెక్టర్ సగిలి షణ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

థ్యాంక్యూ సీఎం సార్..



ముఖ్యమంత్రిని కలిసిన చిత్తూరు షుగర్ ఫ్యాక్టరీ కార్మికులు

చిత్తూరు అగ్రికల్చర్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బహిరంగ సభలో కలిసి చిత్తూరు షుగర్ ఫ్యాక్టరీ కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు.. ఏళ్ల తరబడి పెండింగ్‌లో రూ.31.22 కోట్ల బకాయిలను చెల్లించడంపై ఆనందం వెలిబుచ్చారు. ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన మాట ప్రకారం వేతన బకాయిలు అందించి తమ జీవితాల్లో వెలుగులు నింపారని, తామెప్పుడూ రుణపడి ఉంటామని వెల్లడించారు.

నాడు నామకరణం.. నేడు ధ్రువీకరణ పత్రం

చిత్తూరు అర్బన్: మూడేళ్ల ముందు చిత్తూరులో అమ్మఒడి కార్యక్రమానికి వచ్చిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి .. చామంతిపురం కార్పొరేటర్ ఇందు కుమార్తెకు విజయమ్మగా నామకరణం చేశారు. ఇప్పుడు విజయా డెయిరీ ప్రారంభించడానికి వచ్చిన ఆయన ఆ చిన్నారిని మరోమారు ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా అధికారులు సీఎం చేతుల మీదుగా ఇందు కుమార్తె విజయమ్మకు జనన ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.



చిన్నారి జనన ధ్రువీకరణ పత్రం అందుకున్న కార్పొరేటర్ ఇందు

అంగరంగ వైభవంగా రథోత్సవం



టి.పుత్తూరులో భక్తజన కోలాహలం నడుమ సాగుతున్న శ్రీరాముని రథోత్సవం

తవణంపల్లె: మండలంలో టి.పుత్తూరు కోదండరాముల దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం అంగరంగ వైభవంగా శ్రీరాముని రథోత్సవం నిర్వహించారు. అర్చకులు ఉదయం ఉభయదారులతో స్వామికి తిరుమంజనం, పాలాభిషేకం, తోమాల సేవ నిర్వహించారు. ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ఉయ్యాలసేవ నిర్వహించారు. ఉభయదారులు పూజాసామగ్రి, ప్రసాదాలను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. విశేషంగా అలకరించిన రథంలో శ్రీరాముడు కొలువుదీరి పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టి, కర్పూర నీరాజనాలు సమర్పించారు. భక్తులకు అన్నదానం చేశారు. అలాగే రథోత్సవంలో కేరళ వాయిద్యాలు, చండీ వాయిద్యం, కీలు గుర్రాలు, కొయ్యకాళ్ల నృత్యం, పులివేషాలు, కోలాటాలు మొదలైనవి ఆకట్టుకున్నాయి.



ఉయ్యాలసేవలో ఉత్సవమూర్తుల చిద్విలాసం